క్లుప్తంగా

ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగ సారథిగా దాసు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గానికి చెందిన దుబ్బల దాసును పార్టీ పల్నాడు జిల్లా ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షులుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

డాక్టర్ కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి



నరసరావుపేట: దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతిని ఆర్యవైశ్య నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శివుని బొమ్మ సెంటర్‌లోని రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన రాష్ట్ర ఆర్థికమంత్రిగాను, తమిళనాడు గవర్నర్‌గా రాష్ట్రానికి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్ బాబు, నాయకులు నిడమానూరు సురేంద్ర, కొత్త మాసు మల్లారావు, అడ్డగిరి ద్వారకా వాసు, బత్తుల విష్ణువర్ధనరావు, మిట్టపల్లి శేఖర్, భవిరిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 5వతేదీ శనివారం శ్రీజగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో జగన్నాథుని ఉత్సవమూర్తితో యాత్ర కొనసాగుతుందన్నారు. సాయంత్రం 3.30 గంటలకు ఇస్కాన్ మందిరం నుంచి బయలుదేరిన యాత్ర సత్తెనపల్లిరోడ్డు, మల్లమ్మ సెంటర్, పల్నాడురోడ్డు మీదుగా ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల సమీపంలోని కోమల కన్వెన్షన్ వరకు కొనసాగనుంది. అనంతరం కోమల ఫంక్షన్‌హాల్‌లో స్వామి వారికి 108 రకాల భక్ష్యాలతో మహారాజభోగ నివేదన సమర్పించి భక్తులకు సంపూర్ణ ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో జగన్నాథ రథయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డైక్‌మెన్ కాలనీ, నెహ్రూనగర్, రహమత్ నగర్, వేలూరు డొంక, గుర్రాలచావిడి, శారదా హైస్కూల్ రోడ్డు, పెదనందిపాడురోడ్డు, చీరాల రోడ్డు ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే చిలకలూరిపేట మండలంలోని మానుకొండవారిపాలెం, మిట్టపాలెం, గొట్టిపాడు, దండమూడి, నాగభైరువారిపాలెం, గుదేవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, పసుమర్రు, బొప్పూడి, యడవల్లి గ్రామాలలో కూడా సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డెంగీ జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి అజిత

శావల్యాపురం: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అజిత అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ వ్యాధిపై ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వలన దోమలు వ్యాప్తి చెందుతాయని తద్వారా దోమకాటు వలన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధుల బారిన పడతారన్నారు. డెంగీ వ్యాధి లక్షణాలు జ్వరం, విపరీతమైన తలనొప్పి, కనుగుడ్లు లాగటం తదితరవన్నీ కల్గియుంటారన్నారు. సకాలంలో వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, సీనియర్ సహాయకులు బొడ్డుపల్లి అయ్యన్న పాల్గొన్నారు.

ఏఎంజీలో ప్రాంగణ ఎంపికలు

చిలకలూరిపేట: ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ ప్రాంగణంలోని ఏఎంజీ ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో అమర్‌రాజా, ఎల్‌అండ్‌టీ, ఎల్జీ సర్వీసెస్, క్యాప్టన్ కన్సెల్టెన్సీ, డైకిన్, ఎస్‌ఎస్ఎల్ వంటి 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు వచ్చి ఎంపికలు నిర్వహించారు. మొత్తం 200 మందికి పైగా అభ్యర్థులు హాజరుకాగా వీరి నుంచి 100 మందిని ఎలక్ట్రీషియన్, సివిల్, మోటార్ మెకానిక్, వెల్డర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారికి నియామక పత్రాలు సైతం అందించారు.



వైద్యవిద్యను పేదలకు దూరం చేశారు

- పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను వెంటనే పూర్తిచేయాలి
- పీఆర్ కోసం ఆందోళన చేస్తున్న వైద్యవిద్యార్థులపై లాఠీచార్జి అమానుషం
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు



మాట్లాడుతున్న ఆకాష్, మనోహరరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వం ద్వారా వైద్యవిద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు అందకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చి, సుమారు రూ.2,800 కోట్ల వ్యయంతో వాటి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారన్నారు. అందులోని ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించడం కూడా జరిగిందని అన్నారు. మిగతా 12 మెడికల్ కళాశాలలు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా ఆపేసిందన్నారు. వీటన్నింటిని ఇప్పుడు ప్రైవేటు పరం చేసి తన అనుమాయులకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పూర్తి చేసిన ఐదు మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకురాకపోవటం వలన గడిచిన ఏడాదికాలంలో సుమారు 1200 మెడికల్ సీట్లు కోల్పోవటం జరిగిందన్నారు. దీని వలన వైద్యవిద్యను అభ్యసించాలనుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆశాభంగం నెలకొందన్నారు.

పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను రూ.500 కోట్లతో నిర్మాణం చేపట్టి కళాశాల నిర్మాణం 60 శాతం, హాస్పిటల్ నిర్మాణం 90 శాతం పూర్తిచేశారన్నారు. మరికొద్ది నిధులతో హాస్పిటల్ నిర్మాణం పూర్తిచేస్తే వెనుకబడిన పల్నాడు ప్రాంతమైన గురజాల, మాచర్ల వాసులకు 300 పడకల ప్రభుత్వ వైద్యశాల అందుబాటులోకి వచ్చి ఉండేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో కనీసం 10 శాతం కూడా పనులు చేయకుండా, ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు. తక్షణమే వైద్యశాఖ మంత్రి సత్యకుమార్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పునరాలోచన చేసి మిగిలిన 12 మెడికల్ కళాశాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. దివంగత వైఎస్సార్ మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పించటం వలన ఎంతోమంది బడుగు బలహీన వర్గాలకు చెందిన వేలాదిమంది డాక్టర్లు అయ్యారన్నారు. నరసరావుపేట మండలంలోని చిన్నతురకపాలెం గ్రామంలో 33 మంది డాక్టర్ పట్టా పుచ్చుకొని పేదలకు వైద్య సేవలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కానీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ విద్యను నీరుగార్చి దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్యను అందనీయకుండా అన్యాయం చేస్తుందని అన్నారు.

వైద్య విద్యార్థులపై లాఠీచార్జికి ఖండన

డాక్టర్స్ డే నాడు వైద్య విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చేసిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదికాలంగా విదేశాల్లో వైద్యవిద్యను పూర్తిచేసిన విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబరు అందజేస్తామని చెప్పిన ఈ కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చి నేషనల్ మెడికల్ కౌన్సిల్ దగ్గరికి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని చెప్పడం అన్యాయమన్నారు. దీనిపై ఆందోళన చేస్తున్న వారిపై ప్రభుత్వం పాశవికంగా దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే వాళ్లకు పీఆర్ అందజేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి విభాగ నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు వై.విజయ మనోహరరెడ్డి, నాయకులు ఉప్పుతోళ్ల వేణుమాధవ్, షేక్ ఖాసింషరీఫ్, షాయబ్, జిలాని, నాగూర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు వీరే



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురిని వినుకొండ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు యువజన విభాగ అధ్యక్షులుగా సూరాబత్తుని రాజేశ్వరరావు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా పెట్లూరి అనంతలక్ష్మి, రైతు విభాగానికి బెల్లం శ్రీరామరెడ్డి, బీసీ సెల్‌కు మట్టిరాజయ్య, ఎస్సీ సెల్‌కు కోపెల దేవరాజు, ఎస్టీ సెల్‌కు బాణావత్ భీమ్లానాయక్, మైనార్టీ సెల్‌కు అద్దంకి ముస్తాఫా గౌస్, విద్యార్థి విభాగానికి పూనూరి జోయల్‌ప్రణీత్, క్రిస్టియన్‌మైనార్టీసెల్‌కు చిట్టెం సాల్మన్ రాజు, కల్చరల్ వింగ్‌కు దగ్గుల వెంకట రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. అలాగే దివ్యాంగుల విభాగ అధ్యక్షులుగా పునుగోటి సుబ్బారెడ్డి, డాక్టర్ల వింగ్‌కు డాక్టర్ గోపు చెన్నపరెడ్డి, ఎంప్లాయిస్, పెన్షనర్ల వింగ్‌కు షేక్ సైదా, గ్రీవెన్‌సెల్‌కు పోతిరెడ్డి శ్రీనివాసులు, ఇంటలెక్చువల్ ఫోరంకు జంపఖానాల షేక్ నాగూర్‌మీరావలి, ఐటి వింగ్‌కు అబ్బూరి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వింగ్‌కు దేవిరెడ్డి రేఖ, లీగల్‌సెల్‌కు గంధం వెంకట హరిప్రసాదరావు, మున్సిపల్ వింగ్‌కు షేక్ కాంట్రాక్ట్ గౌస్ బాష, పంచాయతీరాజ్ వింగ్‌కు నక్కా బ్రహ్మానంద రెడ్డి, పబ్లిసిటీ వింగ్‌కు సూరేపల్లి లక్ష్మీ నరసింహమూర్తి, ఆర్‌టీఐ వింగ్‌కు యర్రబోయిన చిరంజీవి, సోషల్ మీడియా వింగ్‌కు కల్లం అనీల్ కుమార్ రెడ్డి, వాణిజ్య విభాగంకు గట్టుపల్లి చిన్నవీరాస్వామి, వలంటీర్ల వింగ్‌కు తలారి చిన్నపుల్లారావు, వీవర్స్ వింగ్‌కు దండే కోటేశ్వరరావు, వైఎస్సార్‌టీయూసీకి సానాల పుల్లయ్య, బూత్‌కమిటీ వింగ్‌కు కొత్తా కృష్ణారెడ్డి నియమితులయ్యారు.

జాగ్రత్తలతోనే జ్వరాల నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.రవి



ఉన్నవ వీధిలో నీటి కుంటను గమనిస్తున్న డీఎంహెచ్‌వో బి.రవి

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి పేర్కొన్నారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్నవ గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్‌తో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం అమలు తీరును వారు పరిశీలించారు. దోమల నిర్మూలన, గ్రామ పరిసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో మలేరియా, డెంగ్యూ జ్వరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం అములులో మెరుగుదల కోసం వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.భరద్వాజ, సీహెచ్‌వో ఎస్.పున్నారావు, మేల్‌ఎంపీహెచ్ఎస్ వడ్లాన రాజశేఖర్, ఉన్నవ గ్రామ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు

నూజెండ్ల ఎంపీడీవో పి.ఉమాదేవి



నూజెండ్లలో నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది



చిలకలూరిపేటలో నివాళులు అర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

నూజెండ్ల: భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో గొప్ప పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి పాల్గొన్ని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమాదేవి మాట్లాడుతూ భారత ఉద్యమంలో మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి అదే సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి అని కీర్తించారు. కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ వయోజన విద్య పర్యవేక్షకుడు కన్నెబోయిన వెంకటేశ్వర్లు, మండల కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ స్ఫూర్తి రగిలించిన అల్లూరి

చిలకలూరిపేట: గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తి రగించటమే కాకుండా వారిలో ఉన్న మూఢ విశ్వాసాలను తొలగింపజేసి ఉద్యమం వైపు నడిపించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, మన్యం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు అని పేర్కొన్నారు. బ్రిటీషర్లకు కంటి మీద కునుకు లేకుండా పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్, కౌన్సిలర్ వడితే కోట్యానాయక్, నాయకులు చిన్నానాయక్, వెంకటేష్ నాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. దేశసేవలో ముగ్గురు నాయకులు ఎంతో సేవందించారని వారిని ఆదర్శంగా తీసుకుని వారిఅడుగుజాడల్లో నడవాలని అన్నారు. స్వామి వివేకానంద,పింగళి వర్ధంతి కార్యక్రమాలు: భారతదేశగొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన వివేకానంద, భారత జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు బేతంగా బ్రియేలు, తెల్లాకుల రాజేష్‌ఖన్నా, వార్డు కౌన్సిలర్లు, యారం రామిరెడ్డి, మాజీసర్పంచ్‌లు కొత్త కృష్ణారెడ్డి,నాగిరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్‌బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వినుకొండ మండలపార్టీ కన్వీనర్ దండుచెన్నయ్య, టౌన్‌కన్వీనర్ కొత్తమాసుశివ, నూజెండ్లకన్వీనర్ ముప్పరాజు వెంకటేశ్వర్లు, తుమ్మా వెంకటరెడ్డి, రొడాపుల్లారెడ్డి లతోపాటు పలువురు పాల్గొన్నారు.



బొల్లాపల్లిలో సీతారామరాజు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు 128వ, జయంతి సందర్భంగా కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, ఎంపీడీవో సీతారామయ్యలు, పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంగేల్యు పాలకుల గుండెల్లో నిద్రపోతూ వారికి కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఆయన శకం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

నరశింహుని సన్నిధిలో తొలిఏకాదశి పూజలు



కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

వినుకొండ: తొలిఏకాదశి తిరుణాళ్ల సందర్భంగా కొండమెట్ల వద్దనున్న పురాతన లక్ష్మీనరశింహ స్వామి ఆలయ 11 వార్షిక కార్యాక్రమాల సందర్భంగా జరిగే కార్యక్రమాల ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 11 ఏళ్ల నుంచి స్వామివారి దేవాలయంలో అనేక అభివృద్ధి కార్యాక్రామలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం రోజున లక్ష్మీనరశింహ స్వామివారి కల్యాణం, ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా స్ఫటిక లింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక సేవకులు జాజులహాల్యాద్రి, న్యాయవాది సైదారావు, బద్దిక వెంకట నరశింహారావు, కాకుమాను రామారావు, ఏటుకూరి కృష్ణవేణి,రమ, నాగేంద్రంలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



కోటసెంటర్‌లోని రంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాపు, రంగారాధా మిత్రమండలి

నరసరావుపేట: కాపు సంఘం, రాధారంగా మిత్రమండలి. ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోటసెంటర్. బరంపేట. గుంటూరు రోడ్డు. సాయినగర్. పల్నాడు బస్టాండ్ సెంటర్లలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు సంఘం అధ్యక్షులు పోతుల శంకర్, అల్లంశెట్టి మోహనరావు. రాయల శ్రీనివాసరావు, రంగిశెట్టి రామకృష్ణ, బొబ్బిలి నాయుడు. రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు పోతంశెట్టి రాము, అద్దెపల్లి ఆనంద్ బాబు, బెల్లంకొండ అనిల్, గుప్తా శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట: పేదల పాలిట పెన్నిధి వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. పట్టణంలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇర్రి రాఘవ, ఊసా రమేష్, సునీత, చెన్నంశెట్టి రాజా, అముదాలవలస అంజి, రంజిత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాదెండ్ల: గణపవరం గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దివంగత వంగవీటి మోహనరంగా 78వ జయంతిని నిర్వహించారు. గ్రామంలోని పోలేరమ్మ ఆలయం వద్ద ఉన్న వంగవీటి, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సంక్షిప్తం

- **రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు**

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండలం లింగంగుట్ల వద్ద రాష్ట్ర రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన డ్రైవర్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

- **బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు అభినందన సభ**

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లోని ఆరు మంది ఉపాధ్యాయులు సాధారణ బదిలీ అయ్యారు. శుక్రవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు పాల్గొని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **సహకార రంగంపై అవగాహన పెంచుకోవాలి**

నరసరావుపేట రూరల్: విద్యార్థి దశ నుంచే సహకార రంగంపై అవగాహన పెంచుకోవాలని డివిజనల్ కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ కె.తిరుపతయ్య తెలిపారు. 103 అంతర్జాతీయ సహకార దినోత్సవంలో భాగంగా శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతయ్య మాట్లాడుతూ నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే అవకాశాలు సహకార రంగంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పమ్మి వెంకటరెడి, డాక్టర్ సుజాత, లింగంగుంట్ల పిఏసీఎస్ ఇంచార్జ్ డి.రవికుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీ ఎం.రామాంజనేయులు, ఇక్కుర్రు కార్యదర్శి కుంటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- **ఎంపీ గారు.. ఇబ్బందుల్లేకుండా చూడరూ...**

శావల్యాపురం: మండల కేంద్రంలో రూ. 5 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న ఆర్‌యూబీ నిర్మాణ పనుల వల్ల భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులకు మండల వాసులు విన్నవించారు. శుక్రవారం గుంటూరులో ఆయన నివాస గృహంలో స్వయంగా కలిసి లిఖిత పూర్వకంగా వివరించారు. నూతన ఆర్‌యూబీ ఏర్పాటు వల్ల గేటు అవతల వైపు 200 కుటుంబాల వారందరూ నివసిస్తున్నారని, ఈక్రమంలో వెళ్లే వారందరికీ రహదారి మార్గం ఉండేలా రైల్వే ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలన్నారు. శావల్యాపురం రైల్వేస్టేషన్ పేరుకు మాత్రమే జంక్షన్‌అని కాని ప్రయాణికులు సౌకర్యం కోసం కొన్ని రైళ్ల మాత్రం నిలుపుదల చేయాలని ఎంపీ దృష్టికి తెచ్చారు. అనంతరం రైల్వే డీఆర్‌ఎంకు కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు విన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, డీఆర్‌ఎంలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

- **ముగిసిన వారాహీ నవరాత్రుల వేడుకలు**

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గామ్మ అమ్మవారి దేవాలయంలో వారాహీ మాతా నవ రాత్రుల వేడుకలు శుక్రవారంతో ముగిసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాల నరసింహారావు తెలిపారు నవరాత్రుల వేడుకలు సందర్భంగా చివరిరోజు అమ్మవారిని దర్శించుకున్న మహిళ భక్తులు అషాఢమాసం పురస్కరించుకొని సారె సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ సారథ్యంలో కుంకుమాభిషేకం, అభిషేకాలు అర్చనలు విశేష పూజలతో భక్తి గీతాలు ఆలపించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

- **అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడిగ్రుడ్లు**

నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిపోయిన కోడిగ్రుడ్లు సరఫరా అవుతున్నాయని పలువురు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. దుర్వాసనతో ఉన్న కోడిగ్రుడ్లు తినలేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మొరబోయిన సబ్బాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు.

- **చుండి రంగనాయకులు సేవలు ఎనలేనివి**

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు చుండి రంగనాయకులు వర్ధంతిని శుక్రవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చుండి విజయసారధి, వేణుగోపాల్, డైరెక్టర్లు రంగనాయకులు, ఆర్యన్‌ఆదిత్య, ప్రిన్సిపల్ ఏబీవీ మనోహర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపు

నరసరావుపేట: ఈనెల తొమ్మిదన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి డి.శివకుమారి అధ్యక్షతన సమ్మె జయప్రదంకై ఏర్పాటు చేసిన సదస్సులో ఆంజనేయులు నాయక్ మాట్లాడారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పుచేసే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమానవేతన చట్టంతో పాటు అనేక కార్మిక చట్టాలను తొలగించడం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా కుదించి అమలుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. కార్మికులు సుదీర్ఘ పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కార్మికవర్గ హక్కులను రద్దు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్మికవర్గ పోరాటాల ద్వారా మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం వ్యవసాయ నల్లచట్టాల అమలుకు పూనుకుందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ సిలార్ మసూద్, ఎల్ఐసి ఏజంట్స్ యూనియన్ నాయకులు సయ్యద్ రబ్బాని, రోడ్డు అండ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హరి పోతురాజు, నాయకులు కె.ఎస్. కృష్ణ పాల్గొన్నారు.